సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

బుధవారం 12-3-2025

సంపుటి: 20 సంచిక: 296

పేజీలు: 8 వెల: రూ.1

> జిల్లా సర్వే ల్యాండ్ రికార్డ్స్‌లో డిప్యూటేషన్‌పై పని చేస్తున్న జి.సిగడాం మండలం పెంట గ్రామ సచివాలయ సర్వేయర్ భాను ప్రతాప్ ఫిబ్రవరి ఒకటిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల సొమ్ము రూ.44 వేలతో పరారయ్యాడు. దాంతో ఇంటి పన్ను కోసం వసూలు చేసిన మొత్తాన్ని పింఛన్ లబ్ధిదారులకు పంపిణీ చేయాల్సి వచ్చింది.

> సచివాలయంలో పౌరసేవలు పొందడానికి అర్జీదారులు చెల్లించే లక్షల రూపాయల సేవా రుసుమును ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి జమ చేయకుండా నెలల తరబడి తన వద్దే పెట్టుకున్న మందస మండలం లోహరిబంద సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ ఎస్‌కే బుకారీని గత నెల 22న కలెక్టర్ సస్పెండ్ చేశారు.

> పల్నాడు జిల్లా దాచేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఒక సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ లక్ష్మీప్రసాద్ ఈ నెలలో లబ్ధిదారులకు చెల్లించాల్సిన పింఛన్ సొమ్మును పట్టుకొని పరారయ్యాడు.
>
> ఈ మూడు ఘటనలు ఒకే కోవకు చెందినవి. నిందితులు ముగ్గురూ ఆన్‌లైన్ బెట్టింగ్ బాధితులే. వీరిపై ఆయా సచివాలయాల పరిధిలో అనేక ఆరోపణలున్నాయి. ఆర్థికపరమైన అనేక మోసాలకు పాల్పడ్డారన్న ఆరోపణలు సైతం ఉన్నాయి.

# 'సర్వే'శుని స్వాహాపర్వం!

- సచివాలయాలు వేదికగా అక్రమాలు
- బదిలీల పేరుతో సహచరుల నుంచే వసూళ్లు
- వారి నుంచి ఒత్తిడి పెరగడంతో విధులకు గైర్హాజరు
- లోహరిబంద గ్రామ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్‌పైనా ఆరోపణలు
- అయినా చర్యలు తీసుకోని జిల్లా అధికారులు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లా పరిధిలోని జి.సిగడాం, మందస మండలాల్లో నిధులు కాజేశారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరు సచివాలయ ఉద్యోగులు దర్జాగా తిరుగుతున్నా, వారి నుంచి సొమ్ము రికవరీ చేయడంలో స్థానిక మండల అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. జిల్లా సర్వేశాఖ కార్యాలయంలో డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్న భానుప్రతాప్ ఆచూకీ లేదని చెబుతున్నారు. అయితే సర్వేశాఖ అధికారులు, సచివాలయ సిబ్బందితో ఆయన టచ్‌లోనే ఉన్నాడు. గత ఏడాది నిర్వహించిన సచివాలయం సర్వేయర్ల బదిలీల్లో సర్వేశాఖ అధికారితో కలిసి పెద్దమొత్తంలో వసూలు చేసినట్టు భానుప్రతాప్‌పై ఆరోపణలు ఉన్నాయి. అయితే డబ్బులు సమర్పించినా కొందరు సర్వేయర్లకు కోరుకున్న చోటుకు బదిలీలు కాకపోవడంతో తాము చెల్లించిన డబ్బు వెనక్కి ఇవ్వాలన్న ఒత్తిడి భానుప్రతాప్‌పై ఉందని సచివాలయ సర్వేయర్లే చెబుతున్నారు. కాగా సుమారు రూ.10 లక్షలు వసూలుచేసి, ఆ మొత్తాన్ని సర్వేశాఖ అధికారికే అప్పజెప్పినట్టు భానుప్రతాప్ కొందరు సహోద్యోగులకు చెప్పినట్టు తెలిసింది. కోరుకున్న చోటకు బదిలీ కాని కొందరు సర్వేయర్లు తీసుకున్న సొమ్ము తిరిగి ఇవ్వాలని ఒత్తిడి తెచ్చినప్పుడు కూడా ఆ మొత్తం సర్వేశాఖ అధికారికే ఇచ్చేశానని భానుప్రతాప్ చెప్పినట్లు బాధితులు చెబుతున్నారు. అయితే బాధ్యుడు భానుప్రతాప్ 45 రోజులుగా విధులకు డుమ్మా కొట్టి తిరుగుతున్నాడు. అయినా ఆయనపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు. మరోవైపు ఆయన కాజేసిన పింఛన్ సొమ్మును పెంట సచివాలయ సిబ్బంది ఇంటి పన్ను సొమ్ముతో భర్తీ చేసి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. దీంతో భానుప్రతాప్‌పై పింఛన్ సొమ్ముతో పరారయ్యాడన్న అభియోగం నమోదు కాలేదు. ఆన్‌లైన్ బెట్టింగ్, రమ్మీకి ఎడిక్ట్ అయిన భానుప్రతాప్ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ అక్రమాలకు పాల్పడినట్టు సహోద్యోగులు చెబుతున్నారు.

### ఆ ఇద్దరిపైనా ఆరోపణలు

మందస మండలం లోహరిబంద గ్రామ కార్యదర్శిగా పనిచేస్తున్న సతీష్‌బాబుపై పలు అవినీతి ఆరోపణలు, పోలీసు కేసులు, ఫిర్యాదులు ఉన్నాయి. ఉద్యోగాలు వేయిస్తానని నిరుద్యోగుల నుంచి రూ.20 కోట్ల మేర వసూలు చేశాడని ఆరోపణలు ఉన్నాయి. బాధితులు కలెక్టర్, జెడ్పీ సీఈవో చుట్టూ తిరిగినా, జిల్లా పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పరిష్కారం లభించలేదు. నాలుగు సార్లు సస్పెండ్ అయినా కార్యదర్శి సతీష్‌లో మార్పు రాలేదు. బదిలీలు, డిప్యూటేషన్లు, హుదూద్ ఇళ్లు ఇప్పిస్తానని 2014 నుంచి అనేకమందిని మోసం చేస్తూ వస్తున్నాడు. విచారణ పేరుతో సతీష్‌ను పిలిపిస్తున్న పోలీసులు, జెడ్పీ అధికారులు అతగాడు ఇచ్చే ప్యాకేజీని తీసుకొని విడిచిపెట్టేస్తూ బాధితులకు అన్యాయం చేస్తున్నారు. సతీష్ పరిధిలో పని చేసే సచివాలయ డిజిటల్ సహాయకుడు రూ.లక్ష సేవా రుసుము కాజేశాడని మందస ఎంపీడీవో తీరిగ్గా కలెక్టర్‌కు నోట్ పెట్టడడం అనుమానాలకు తావిస్తోంది. ఒక సచివాలయంలో సేవా రుసుము రూ.లక్ష జమ కావాలంటే ఆరు నెలల వ్యవధి పడుతుంది. ప్రతి నెల సేవా రుసుమును ప్రభుత్వానికి జమ చేయాల్సిన ఉద్యోగి వాటిని సొంతానికి వాడుకుంటే నిలదీయాల్సిన గ్రామ క్యార్యదర్శి సతీష్‌ను ఎందుకు బాధ్యుడిని చేయలేదని విమర్శలు ఉన్నాయి. ఎంపీపీడీవో ఆరు నెలల పాటు తాత్సారం చేసి చివరి నిమిషంలో ప్రభుత్వానికి చెల్లించాల్సిన రూ.లక్ష జమచేయలేదని కలెక్టర్‌కు నివేదిక పంపించి సస్పెండ్ చేయించారు. ప్రభుత్వ సొమ్మును కాజేసిన సచివాలయం డిజిటల్ అసిస్టెంట్ బుకారీని గ్రామ కార్యదర్శి సతీష్ పూర్తిగా ప్రోత్సహిస్తూ వచ్చారన్న విమర్శలు ఉన్నాయి.

### అక్రమార్కులకే బాధ్యతలు

ఫిబ్రవరి 22న సస్పెండ్ అయిన బుకారీకి మార్చి ఒకటో తేదీన పింఛన్లు పంపిణీ చేసే బాధ్యత అప్పగించారు. గ్రామ కార్యదర్శి సతీష్ బాబు ఆధ్వర్యంలో రోడ్డుపైనే ద్విచక్ర వాహనంపై కూర్చొని లబ్ధిదారులను ఎండలో నిలబెట్టి బయోమెట్రిక్ తీసుకొని పింఛన్ల మొత్తాన్ని పంపిణీ చేస్తున్నారు. ప్రభుత్వ ఖజానాలో జమ చేయాల్సిన రూ.లక్షను సొంతానికి వాడుకున్నాడన్న అభియోగంతో కలెక్టర్ సస్పెండ్ చేసిన వారం రోజుల్లోనే లోహరిబందలో డిజిటల్ అసిస్టెంట్ ఎస్‌కే బుకారీకి పింఛన్ల సొమ్ము అప్పగించి పంపిణీ చేయించారు. ఆర్థిక నేరారోపణలపై సస్పెండైన ఉద్యోగి చేతిలో పింఛన్ సొమ్ము పెట్టి పంపిణీ చేయడం మండల అధికారుల నిర్లక్ష్యానికి, బాధ్యతారాహిత్యానికి నిదర్శనం. కూటమి ప్రభుత్వం పింఛన్ల పంపిణీని ప్రతిష్టాత్మకంగా తీసుకొని లబ్ధిదారుల ఇంటి వద్దే పంపిణీ చేయాలని ఆదేశించింది. అయితే ఈ ఆదేశాలను అధికారులు బేఖాతరు చేసి సచివాలయానికి లబ్ధిదారులను పిలిపించి కొన్ని చోట్ల పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. లోహరిబందలో ఆర్థిక నేరాలు, అక్రమాలు, ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేసినట్టు ఆరోపణలు ఎదుర్కొంటూ విధుల నుంచి సస్పెండైన సచివాలయ ఉద్యోగి బుకారీ ఒకరైతే, ఉద్యోగాలు, బదిలీల పేరుతో ఉద్యోగులను, నిరుద్యోగులను, అమాయకులను టోకరా వేసి రూ.20 కోట్లు కాజేశాడని అభియోగాలు ఎదుర్కొంటున్న గ్రామ కార్యదర్శి సతీష్‌బాబు ఒకరు. ఇద్దరూ ఒకేచోట పని చేస్తున్నారు. వీరికి మండల అధికారి వత్తాసు పలుకుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. సచివాలయ వ్యవస్థను గాడిన పెట్టాల్సిన అధికారులే అక్రమాలకు పాల్పడిన ఉద్యోగులను వెనకేసుకు వస్తున్నారని విమర్శలున్నాయి. ప్రభుత్వ సొమ్ము రూ.లక్ష కాజేసిన ఉద్యోగి పింఛన్ సొమ్ముతో ఉడాయిస్తే ఆ బాధ్యత ఎవరు తీసుకుంటారని ప్రశ్నలూ వినిపిస్తున్నాయి. ప్రభుత్వ ప్రతిష్టను దిగజార్చే విధంగా వ్యవహరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.




## ఘనంగా శివన్నారాయణ జన్మదిన వేడుకలు

**- పెద్ద సంఖ్యలో పాల్గొన్న అభిమానులు -**



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

బలగ బుచ్చిపేట ప్రాంతానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, సామాజికవేత్త రెడ్డి చిరంజీవులు తనయుడు రెడ్డి శివన్నారాయణ జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించినారు. అభిమానులు, స్థానికులు, రెడ్డి శివన్నారాయణ ఫాలోవర్స్ పుట్టినరోజు వేడుకల్లో పాల్గొనగా, వేద పండితులు, పురోహితులు శివన్నారాయణ మరెన్నో జన్మదిన వేడుకలను జరుపుకోవాలని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా శివన్నారాయణ మాట్లాడుతూ తన పట్ల అభిమానం చూపుతున్న ప్రతిఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ప్రతి సంవత్సరం తన జన్మదిన వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్న బలగ, బుచ్చిపేట, ఆదివారం పేట యూత్, ఆర్ఎస్ఎన్ ఫాలోవర్స్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బలగ బుచ్చిపేట యూత్, ఆదివారంపేట యూత్, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

### ఘనంగా శ్రీరాముని శోభాయాత్ర

బుచ్చిపేట ప్రాంతంలో ఎంతో పురాతనమైన రామ మందిరం పునః నిర్మించి మూడు రోజులపాటు అంగరంగ వైభవంగా పూజలు నిర్వహించి స్వామివారిని ప్రతిష్టిస్తున్నారు. స్వామివారి శోభ యాత్రలో స్థానికులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ఊరేగింపు నిర్వహించారు. శివన్నారాయణ పుట్టినరోజు వేడుకలు, రామ మందిరం పునః ప్రతిష్ట రెండూ ఒకేసారి జరగడం తనకు చాలా ఆనందంగా ఉందన్నారు. రెడ్డి శివన్నారాయణ మాట్లాడుతూ తాను ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావడం పూర్వజన్మ సుకృతమన్నారు. బలగ బుచ్చిపేట యూత్, ఆర్ఎస్ఎన్ ఫాలోవర్స్ పెద్ద సంఖ్యలో పాల్గొన్ని బాణాసంచా కాల్చి, కేక్ కట్ చేశారు.



## వమరవల్లి లిఫ్ట్ ఇరిగేషన్‌కు నిధులు మంజూరుచేయండి

**- సీఎంను కలిసిన ఎమ్మెల్యే గొండు శంకర్ -**

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



గార మండలం వమ్మరవెల్లి లిఫ్ట్ ఇరిగేషన్ పనులు పూర్తి చేయడానికి నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ కోరారు. ఈమేరకు వినతి పత్రం అందించారు. అలాగే బ్రహ్మకుమారీస్ సమస్యలను, ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సహాయం అందించవలసిందిగా మరో వినతి పత్రాన్ని కూడా అందించారు. అంతకు ముందు శ్రీకాకుళం రూరల్ మండలం సింగుపురం వద్ద నిర్మిస్తున్న నర్సింగ్ కళాశాలను త్వరలో పూర్తిచేసి అందుబాటులోకి తేవాలని ఎమ్మెల్యే శంకర్ శాసనసభలో కోరారు. 2014-15 సంవత్సరంలో ఈ కళాశాల మంజూరై 2016లో పనులు ప్రారంభించారని, తొలి విడత రూ.5 కోట్లు విడుదల చేశారని, కాంట్రాక్టర్ పనులు ప్రారంభించిన తర్వాత కేవలం రూ.2 కోట్లే రిలీజ్ చేశారని, అక్కడితో పని ఆగిపోయిందని తెలిపారు. ప్రస్తుతం రూ.20 కోట్లు మంజూరుచేస్తే జిల్లావాసులకు నర్సింగ్ కళాశాల అందుబాటులోకి వస్తుందన్నారు. కేవలం గ్రౌండ్ వర్క్ పిల్లర్స్ వరకు మాత్రమే పనులు జరిగాయని, ప్రభుత్వం ప్రత్యేకదృష్టి సారించి నిధులు మంజూరు చేస్తే ఒక సంవత్సరంలో పనులు పూర్తవుతాయని, దీనిపై ముఖ్యమంత్రి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ప్రత్యేక దృష్టి సారించాలని శంకర్ కోరారు.

## ఫీజు బకాయిలు తక్షణమే చెల్లించాలి

**- 'యువత పోరు'లో కృష్ణదాస్ డిమాండ్ -**

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



విద్యార్థుల ఫీజు బకాయిలను తక్షణమే చెల్లించాలని కూటమి ప్రభుత్వాన్ని వైకాపా జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ డిమాండ్ చేశారు. వైకాపా అధిష్టానం పిలుపు మేరకు యువత పోరు కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైకాపా నాయకులు, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు, పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జీలు పేరాడ తిలక్, రెడ్డిశాంతి, గొర్లె కిరణ్‌కుమార్, చింతాడ రవికుమార్, కళింగ కార్పొరేషన్ మాజీ చైర్మన్, రాష్ట్ర కళింగ సామాజిక వర్గ అధ్యక్షులు దుంపల రామారావు తదితరులు పూలే పార్క్ నుంచి ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వైకాపా నాయకులు మాట్లాడతూ కూటమి ప్రభుత్వం విద్యార్థులను నమ్మించి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా మోసం చేసిందని దుయ్యబట్టారు. కూటమి 10 నెలల పాలనలో అన్ని వర్గాలను ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టారని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా రూ. 3900 కోట్ల ఫీజు బకాయిలు ఉంటే.. బడ్జెట్‌లో కేవలం రూ. 2600 కోట్లు కేటాయించి విద్యార్థులకు, యువతకు తీవ్ర అన్యాయం చేశారని ఆరోపించారు. నిరుద్యోగులకు నిరుద్యోగ బృతి చెల్లిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత మరిచిపోయారని ఎద్దేవా చేశారు. విద్యార్థులకు, నిరుద్యోగులకు తక్షణమే న్యాయం చేయాలని కలెక్టరేట్‌లో డీఆర్వో వెంకటేశ్వరరావును కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వైకాపా నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

• ఎడిటోరియల్

# కర్మ రిటర్న్స్

ఒకేవిధమైన వస్త్రధారణ ఉన్న కారణంగా హిందూ పురుషులను గుర్తించడానికి సున్తీ జరిగిందా? లేదా? అని పరీక్ష చేసి చంపేవారు. ఇప్పుడు బాలూచీ భాష వస్తే వదిలేస్తారు. ఉర్దూ మాట్లాడితే చంపేస్తున్నారు బాలూచ్ ఉగ్రవాదులు. మంగళవారం రైలులో ఉన్న ప్రయాణీకులను కూడా అలాగే చంపినట్లు ప్రాథమిక అంచనా. పాకిస్తాన్‌లోని పంజాబీలంటే బాలూజ్‌లకు అసలు నచ్చదు. 2029 లోపే పాక్ ఆక్రమిత కశ్మీర్ భారత్‌లో కలిసిపోవచ్చు. తర్వాత ఖైబర్ ఫక్తున్వా ఆఫ్గనిస్తాన్‌లో కలిసిపోతుంది. బాలూచ్‌కు స్వాతంత్ర్యం కూడా 2029లో రావచ్చు. బాలూచిస్తాన్‌లో ఉన్న గ్వాదర్ పోర్టు చైనా చేతిలో ఉండటం అమెరికాకు ఇష్టం ఉండదు. చేసిన అప్పులకు పాకిస్తాన్ తిరిగి ఇవ్వమని అడగలేదు. బాలూచిస్తాన్‌లో అపారమైన ఖనిజ సంపద ఉంది. అమెరికా ఎలా వదులు కుంటుంది? కశ్మీర్‌లో ఇటువంటి వాతావరణం ఉన్నందునే కదా.. పాకిస్తాన్ కొన్ని దశాబ్దాలుగా అక్కడ రావణకాష్టం రగిలిస్తోంది. కశ్మీర్‌ను తనలో కలిపేసుకోవడం కోసం ఎన్ని కుట్రలు పన్నింది? ఇప్పుడు మనకు కశ్మీర్ ఎలాగో, పాకిస్తాన్‌కు బాలూచిస్తాన్ అలాగ. అక్కడ సెగ మొదలైతే గాని బాధేమిటో పాకిస్తాన్‌కు అర్థమైనట్టులేదు. కర్మ అనుభవించడం కొనిసార్లు ఆలస్యం కావచ్చేమో గానీ, అమలుకావడం మాత్రం పక్కా. ఒక్కసారి గతంలోకి వెళ్తే.. వికీలీక్స్ పత్రాలు బయటపడినప్పుడు.. అంటే నాలుగేళ్ల క్రితం 2029 నాటికి పాకిస్తాన్ నాలుగు ముక్కలుగా విభజించాలని అమెరికా డీప్‌స్టేట్ ప్రణాళిక ఉందని తేలింది. జూలియస్ అసాంజే బయటపెట్టిన రహస్యాల్లో పాకిస్తాన్ కంటే ఇతర విషయాలు ఎక్కువ ప్రాముఖ్యత కలిగినవి ఉండటంతో ఈ వార్త అప్పట్లో పెద్దగా వైరల్ కాలేదు. కానీ వికీలీక్స్‌లో పేర్కొన్నవన్నీ జరుగుతున్నాయి. జాగ్రత్తగా గమనిస్తే సిరియాలో తిరుగుబాటు జరిగి అధికార మార్పిడి రక్తపాతం లేకుండా పూర్తయింది. కానీ మూణ్ణెళ్లయిందో లేదో, ఇప్పుడు షియా, సున్నీ తెగల మధ్య ఘర్షణలు మొదలై వందల్లో షియాలను సున్నీలు చంపేస్తున్నారు. దీనర్థం సిరియాను కూడా మూడు ముక్కలు చేసి ఒక ముక్క ఇజ్రాయెల్, ఒక ముక్క సున్నీలకు, మరో ముక్క షియాలకు అమెరికా అప్పజెబుతోంది. అంతకంటే ముందు బలూచిస్తాన్‌కు మద్దతిస్తుంది. అందులో భాగంగానే బలూచిస్తాన్ రాజధాని క్వెట్టా నుంచి పెషావర్‌కు వెళ్తున్న జాఫర్ ఎక్స్‌ప్రెస్‌ను బీఎల్‌ఏ తీవ్రవాదులు హైజాక్ చేశారు. రైలులో సైనికులతో పాటు 400 మంది ప్రయాణీకులు ఉన్నారని మీడియా పేర్కొంది. పాకిస్తాన్‌లో ప్రముఖ దినపత్రిక డాన్ కథనం ప్రకారం క్వెట్టా నుంచి పెషావర్ వెళ్తున్న జాఫర్ ఎక్స్‌ప్రెస్ బోలన్ జిల్లాలోని పెహరో కునారీ, గాదలర్‌ల మధ్య 8వ నెంబర్ టన్నెల్ వద్ద బలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ తీవ్రవాదులు ఇంజిన్‌లో చివరలో ఉండే గార్డు బోగీ మీదకు కాల్పులు జరిపి రైలును ఆపేశారు. బీఎల్‌ఏ కాల్పుల్లో లోకోపైలట్ ఒకరు మరణించినట్టు తెలుస్తుంది. జాఫర్ ఎక్స్‌ప్రెస్ కొద్ది నిమిషాల్లో 8వ నెంబర్ టన్నెల్‌లోకి ప్రవేశిస్తుందనగానే దానికి ముందే ట్రైన్‌ను ఆపేశారు. పెహరో కునారీ, గాదలర్ ప్రాంతాలు పర్వతాలతో నిండివుంటాయి. అందుకే సొరంగాలు ఎక్కువగా ఉంటాయి. తీవ్రవాదులు దాడి చేసి తప్పించుకోడానికి అనువుగా ఉంటుంది. అందుకే జాఫర్ ఎక్స్‌ప్రెస్‌లో సైనికుడ్ని కాపలాగా ఉంచుతారు. ప్రస్తుతానికి సైనికులకు, తీవ్రవాదులకు మధ్య కాల్పులు జరుగుతున్నాయి. బలూచిస్తాన్‌లో ఎమర్జెన్సీ విధించి మరిన్ని భద్రతా దళాలను తరలించడానికి రెండు ప్రత్యేక రైళ్లను పాకిస్తాన్ ప్రభుత్వం పంపుతుంది. 2024 నవంబరులో క్వెట్టా రైల్వేస్టేషన్‌లో ఆత్మాహుతి దాడి జరిగి 60 మంది చనిపోయారు. దీంతో రెండు నెలల పాటు క్వెట్టా నుంచి పెషావర్ వరకు రైలు సర్వీసులు రద్దు చేశారు. ఇటీవలే మళ్లీ సర్వీసులను పునరుద్ధరించారు. రైలు హైజాక్, రైల్వేస్టేషన్‌లో ఆత్మాహుతిదాడి వంటివి పాకిస్తాన్ ప్రాంతంలో జరగడం కొత్త కాకపోయినా, ప్రత్యేక దేశం కావాలనే నినాదంతో ఇటువంటివి జరగడం కచ్చితంగా కర్మఫలితాన్ని అనుభవించడమే. మొన్నటికి మొన్న జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీ క్రికెట్ మ్యాచ్‌లలో బలూచిస్తాన్ ఏదో ఒక టీమ్ మీద గెలిచి ప్రపంచ పటంలో తామూ ఉన్నామని, స్వతంత్ర దేశాన్ని కోరుకుంటున్నామని అంతర్జాతీయ వేదిక మీద నోరిప్పాలని ప్రయత్నించింది. కానీ అది కుదరలేదు. ఇప్పుడు రైలు హైజాక్ ద్వారా ఒక్కసారిగా అంతర్జాతీయంగా బలూచిస్తాన్ అంశం తెర మీదకు వచ్చింది. ఇన్నాళ్లూ అంతర్జాతీయ మీడియాతో పాటు భారత్ మీడియా కూడా పాకిస్తాన్‌లో జరుగుతున్న ఈ వేరుకుంపటి అంశాన్ని పెద్దగా ఫోకస్ చేయలేదు. పక్కదేశంలో పుల్లలు పెట్టే పాకిస్తాన్‌లోనే ఇప్పుడు ఒక రైలు హైజాక్ కావడం ఎంతమాత్రమూ కాకతాళీయం కాదు. నేపాల్‌లో బయల్దేరిన ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానం కాందహార్‌లో దిగిన ఘటన గుర్తొస్తే.. అది మా తప్పు కాదు.



వైకాపా ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పాతపట్నం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి అధ్యక్షతన నియోజకవర్గంలోని ఎల్.ఎన్.పేట మండలం, ఎల్.ఎన్.పేట మేజర్ పంచాయితీలో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వైకాపా పతాకాన్ని ఆవిష్కరించి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా పిల్లలకు, మహిళలకు మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

**– సత్యంన్యూస్, పాతపట్నం**



పార్లమెంట్ సభ్యులు స్వర్గీయ బొడ్డేపల్లి రాజగోపాల్ రావు 102 జయంతి సందర్భంగా ఆమదాలవలసలో గల ఆయన విగ్రహాలకు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ సనపల అన్నాజీరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లా అభివృద్ధి ప్రధాత, జిల్లా దిశా దశ మార్చిన మహానేత, అభివృద్ధి అంటే గుర్తొచ్చే మహోన్నతమైన నేత, ఎందరో హృదయాల్లో బొడ్డేపల్లి రాజగోపాలరావు చిరస్మరణీయులుగా నిలిచారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

**– సత్యంన్యూస్, ఆమదాలవలస**

## మెనూ సక్రమంగా అమలు చేయాలి



**(సత్యంన్యూస్, పాతపట్నం)**

విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని, పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు బి.కాంతారావు అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం పాతపట్నం మండలం మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్లు వాహనాన్ని, అంగన్వాడీ కేంద్రాన్ని, ప్రభుత్వం పాఠశాలలు ఆకస్మిక తనిఖీ చేశారు. ముందుగా బూరగాంలో రేషన్ షాప్, ఎండీయూ వాహనాన్ని, అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి సంబంధిత రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజన వంటకాల నాణ్యతను పరిశీలించి విద్యార్థినిలతో ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సనపల కిరణ్‌కుమార్, సీఎస్‌డీటీ ప్రసాదరావు, చక్రవర్తి, ఐసీడీఎస్, వైద్యఆరోగ్య శాఖ, తూనికలు కొలతలు శాఖ, ఎండీయూ ఆపరేటర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు రౌతు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాజీ పార్లమెంటు సభ్యుడు స్వర్గీయ బొడ్డేపల్లి రాజగోపాలరావు జయంతి సందర్భంగా కోటబొమ్మాళి మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఉన్న రాజగోపాలరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అన్నెపు రామారావు, రోణంకి మల్లేశ్వరరావు, సంపతిరావు హేమ సుందర్ రాజు, నూక సత్యరాజ్, దుబ్బ వెంకట్రావు, కెల్లి గోవింద్, ఎన్ని మన్మధరావు, పేడాడ వెంకట్రావు, యస్.వినోద్, రామకృష్ణ, జనార్ధన్‌రెడ్డి, తలగాన గణపతి, మెట్ట సింహాచలం, హనుమంతు గోవింద్, బొడ్డు వెంకటరమణ, చెంచులు, తర్ర రమణారావు, గుంట సోమేశ్వరరావు, వాసు, సనపల పవన్, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, రాజగోపాలరావు అభిమానులు పాల్గొన్నారు.

**– సత్యంన్యూస్, కోటబొమ్మాళి**

## వైకాపాతోనే ప్రజాసంక్షేమం

**(సత్యంన్యూస్, టెక్కలి)**

వైకాపాతోనే ప్రజాసంక్షేమం అభివృద్ధి జరుగుతుందనే ఉద్దేశ్యంతో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వైకాపాను స్థాపించారని టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేరాడ తిలక్ అన్నారు. వైకాపా ఆవిర్భావ దినోత్సంలో భాగంగా బుధవారం టెక్కలిలో తిలక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టెక్కలిలోని వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ద్విచక్రవాహన ర్యాలీతో టెక్కలి పార్టీ కార్యాలయానికి చేరి పార్టీ జెండాను కార్యకర్తల సమక్షంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తిలక్ మాట్లాడుతూ గడచిన ఐదేళ్లలో ముఖ్యమంత్రిగా రాష్ట్రాన్ని పరిపాలించిన జగన్మోహన్‌రెడ్డి రాజకీయాలకతీతంగా పేద ప్రజల సంక్షేమానికి, అణగారిన వర్గాల అభివృద్ధికి నిరంతరం పని చేశారన్నారు. మళ్లీ ప్రజలు జగన్మోహన్ రెడ్డి పాలన కోరుకుంటున్నారన్నారు. కార్యక్రమం అనంతరం వందలాది మంది ప్రజాప్రతినిధులు కార్యకర్తలతో కలిసి శ్రీకాకుళంలో జరిగే ఫీజు పోరు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో టెక్కలి, నందిగాం, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు జిల్లా పార్టీ నాయకులు, నియోజకవర్గ మండల అనుబంధం భాగాల అధ్యక్షులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



వైకాపా ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కృష్ణదాస్‌ను పార్టీ నాయకులు సత్కరించి జగన్‌తో కలిసి ఉన్న చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎంవీ పద్మావతి, యువ నాయకులు డాక్టర్ ధర్మాన కృష్ణచైతన్య, వైకాపా సీనియర్ నాయకులు అందవరపు సూరిబాబు, గొండు కృష్ణ, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, జిల్లా కార్యవర్గసభ్యులు తదితరులు పాల్గొన్నారు. **– సత్యంన్యూస్, శ్రీకాకుళం**



# ఇండస్ట్రీలో ఎక్స్ఛేంజ్ మేళా!





**ఒకప్పుడు టాలీవుడ్‌లో హీరోయిన్లు అంటే ఎక్కువగా బాలీవుడ్‌లో సక్సెస్ అయిన భామలే కనిపించేవారు. ముంబై మోడల్స్ ఎక్కువగా దిగుతమతి అయ్యేవారు. కానీ నేడు ట్రెండ్ మారిన సంగతి తెలిసిందే. సౌత్ నుంచి ఎక్కువగా టాలీవుడ్‌కి దిగుమతి అవుతున్నారు. అయితే ఈ మధ్య కాలంలో సౌత్ టూ నార్త్..నార్త్ టూ సౌత్ అంటూ ఎక్ఛేంజ్ మేళా కూడా కనిపిస్తుంది. ఉత్తరాది భామలు దక్షిణాది వైపు రావడం....ఇక్కడ భామలు అక్కడకెళ్లి సత్తా చాటడం అన్నది ఆసక్తికరంగా మారింది.**

బాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్లుగా నీరాజనాలు అందుకుంటోన్న దీపికా పదుకొణె 'కల్కి 2898'తో, 'ఆర్ఆర్ఆర్'తో అలియాభట్, టాలీవుడ్‌లో లాంచ్ అయిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ భామలిద్దరికీ టాలీవుడ్‌లో జోరుగా అవకాశాలు వస్తున్నాయి. కానీ ఆచితూచి అడుగులు వేస్తున్నారు. ఇటీవలే సోనాక్షి సిన్హాకూడా 'జఠాధర'తో లాంచ్ అవుతుంది. ఈ సినిమాలో ఓ కీలకపాత్ర పోషిస్తుంది. వాస్తవానికి లింగ సినిమాతోనే సోనాక్షి సౌత్‌లో లాంచ్ అయింది. కానీ అప్పుడు కానీ కొనసాగలేదు. తాజాగా సౌత్ మార్కెట్ డిమాండ్ చూసి ముందుకొస్తుంది. అలాగే కియారా అద్వాణీ సౌత్ కంటే ముందే బాలీవుడ్‌లో ఫేమస్ అయింది. ఇటీవల రిలీజ్ అయిన 'గేమ్ ఛేంజర్' లోనూ నటించింది. జాన్వీ కపూర్ అయితే టాలీవుడ్ స్టార్ హీరోలే టార్గెట్‌గా పని చేస్తోంది. ఇప్పటికే తారక్‌తో దేవరలో నటించింది. ప్రస్తుతం రామ్ చరణ్ 16వ చిత్రంలో నటిస్తుంది. అలాగే సిస్టర్ ఖుషీకపూర్ కూడా కోలీవుడ్ లాంచింగ్ ప్రయత్నాల్లో ఉన్నట్లు సమాచారం. ఇలా బాలీవుడ్ భామల వెల్లువ సౌత్ లో కనిపిస్తుంది. ఇక సౌత్ నుంచి నార్త్‌లో సత్తా చాటుతున్న వాళ్లలో రష్మికా మందన్నా ముందువరుసలో ఉంది. మూడేళ్ల క్రితం గుడ్‌బై తో హిందీలోకి ఎంట్రీ ఇచ్చిన రష్మిక ఇప్పుడే స్థానంలో కొనసాగుతుందో చెప్పాల్సిన పనిలేదు. ఇటీవలే 'ఛావా'తో గొప్ప చారిత్రాత్మక విజయం అందుకుంది. ప్రస్తుతం లైన్‌లో మూడు నాలుగు సినిమాలున్నాయి. అలాగే సాయిపల్లవి ప్రతిష్టాత్మక చిత్రం 'రామాయణ్'లో సీత పాత్రలో నటిస్తోంది. ఎంతోమంది బాలీవుడ్ భామలున్నా నితీష్ తివారీ ఏరికోరి మరీ సాయి పల్లవిని తీసుకున్నారు. అలాగే యంగ్ బ్యూటీ శ్రీలీల కూడా బాలీవుడ్ డెబ్యూ కూడా ఫిక్సైంది. అమ్మడి ఎనర్జీ బాలీవుడ్‌కి గనుక కనెక్ట్ అయితే మామూలుగా ఉండదు. అలాగే కీర్తి సురేష్ కూడా హిందీలో సినిమాలతో వెబ్ సిరీస్‌ల్లోనూ నటిస్తోంది.

– తుపాకి.కామ్ సౌజన్యంతో...






## ఆఫ్‌షోర్ రిజర్వాయర్ ఎప్పుడు పూర్తి చేస్తారు?

(సత్యంన్యూస్, నందిగాం)

ఆఫ్‌షోర్ రిజర్వాయర్ ఎప్పుడు పూర్తి చేస్తారని రాష్ట్ర ప్రభుత్వాన్ని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావు ప్రశ్నించారు. ప్రజా చైతన్యయాత్రలలో భాగంగా బుధవారం నందిగాంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు నంబూరు షణ్ముఖరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఆఫ్షోర్ రిజర్వాయర్ 2007లో ప్రారంభించి నేటికి 18 సంవత్సరాలు పూర్తయినప్పటికీ చాపర నుండి రేగులపాడుకు 13 కిలోమీటర్లు కనీసం అందులో సగం కూడా పూర్తి చేయలేదని విమర్శించారు. శ్రీకాకుళం జిల్లా పట్ల నిర్లక్ష్యానికి ఇదొక నిదర్శనమని వారు విమర్శించారు. 2007లో రూ.127 కోట్లు అంచనా వ్యయమైతే నేడది రూ.852కోట్లకు పెరిగిందన్నారు. ఆఫ్‌షోర్ రిజర్వాయర్‌కు రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్లో ఎందుకు తగిన నిధులు కేటాయించలేదో వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ప్రజలకు సమాధానం చెప్పాలని వారు డిమాండ్ చేశారు. ఆఫ్‌షోర్ రిజర్వాయర్‌కు కనీసం రూ.500కోట్లు రూపాయలు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్లో మొక్కుబడి కేటాయింపులు పాత పనులకు బిల్లులకే సరిపోతుందని వారు అన్నారు. ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పూర్తయితే మెళియాపుట్టి మండలంలో 3,890 ఎకరాలు పలాస మండలంలో 6,800 ఎకరాలు నందిగామ మండలంలో 12,090 ఎకరాలు, టెక్కలి మండలంలో 1,820 ఎకరాలు మొత్తం 24,600ఎకరాలు భూమికి సాగునీరుతోపాటు పలాసకు త్రాగునీరు ఇవ్వవచ్చన్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం శ్రీకాకుళం జిల్లా పట్ల నిర్లక్ష్యమే నిధులు కేటాయించక పోవడానికి కారణమన్నారు. పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు కేటాయించకపోతే పోరాటం తప్పదని హెచ్చరించారు. జిల్లాలో గిరిజన ప్రాంతాన్ని ఐదవ షెడ్యూల్‌లో చేర్చాలన్నారు. ఐటీడీఏను ఏర్పాటు చేయాలన్నారు. రైతులు పండించిన మొత్తం ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు పాళిన సాంబమూర్తి, హనుమంతు ఈశ్వరరావు తదితరులు ప్రసంగించారు.




'సత్యం'లో ప్రకటనల కొరకు సంప్రదించండి
8019 221 221

### పేరుకే పెద్ద ఆసుపత్రి...
# సదుపాయాలు మాత్రం శూన్యం




- రోగులకు గాలికి వదిలేసి క్లినిక్‌లకు పోతున్న డాక్టర్లు
- ఆసుపత్రి ప్రధాన వైద్యుడే కీలక పాత్ర పోషిస్తున్న వైనం
- శానిటేషన్ వర్కర్స్‌తో సెలైన్ బాటిల్ పెట్టిస్తున్న వైనం
- ప్రభుత్వాలు మారినా మారని ఆసుపత్రి పరిస్థితి
- ఇంత జరుగుతున్నా పట్టించుకోని జిల్లా వైద్య అధికారులు

(సత్యంన్యూస్, పాతపట్నం)

నియోజకవర్గంలోని కొత్తూరు మండలం చుట్టూ ప్రక్కల ఉన్న అనేక గ్రామ ప్రజలకు కొత్తూరు కమ్యూనిటీ హెల్త్‌సెంటరే (సీహెచ్‌సీ) ఇక్కడ పెద్ద ఆసుపత్రి. జిల్లా కేంద్రానికి చాలా దూరంగా ఉన్న ఈ ప్రాంతానికి ఏకైక ఆసుపత్రి కూడా ఇదొక్కటే. కానీ ఇక్కడ కనీస మౌలిక సదుపాయలు కూడా లేకపోవటంతో ఇక్కడికి వచ్చిన రోగులు మరింత అనారోగ్య బారిన పడుతున్నారు. 30పడకలతో కూడిన ఈ ఆసుపత్రిలో వచ్చిన రోగులు చాలా ఇబ్బందులకు గురి కావాల్సి వస్తోంది. రోజుకు 100కు పైగా వచ్చిన రోగులకు రక్త పరీక్షలు, 200మందికి పైగా అవుట్ పేషెంట్స్ ఉంటున్నారంటే రోజురోజుకి ఈ ఆసుపత్రికి వచ్చిన రోగులు సంఖ్య క్రమంగా పెరుగుతూ వస్తోంది. ఇక్కడ కనీస వసతులు లేకపోవటంతో వచ్చిన చాలామంది రోగులు ప్రైవేట్ ఆసుపత్రుల వైపు తిరిగి తరలి వెళ్లిపోతున్న పరిస్థితి నెలకొంటోంది. ఎముకలు విరిగి ఆసుపత్రిలో చేరితే ఎక్సరే రిపోర్ట్ రావటానికి 2 లేదా 3 రోజుల కాల వ్యవధి పడుతోంది. ఈలోగా నొప్పిని భరించలేక రోగి జిల్లా కేంద్రంలో ఉన్న ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లాల్సి వస్తోంది. జేబులో పైసలు ఉన్నవారు ఎలానో వెళ్ళిపోతారు కానీ బడుగు బలహీన వర్గ పేద ప్రజల పరిస్థితి అలా కుదరదు కదా ఇక్కడికే రావాలి ఇక్కడే వైద్యం చేయించుకోవాలి. నొప్పిగా ఉన్నా భరించి తప్పక ఇక్కడ ఉండాలి. ఇక్కడ ఉన్నా కూడా రోగులకు ఎక్కించే సెలైన్ బాటిల్‌ను రోగితోపాటు తోడుగా వచ్చిన వాళ్ళే పట్టుకోవాల్సి వస్తోంది. ఎందుకంటే ఇక్కడ స్టాండ్‌లు కూడా లేని పరిస్థితి నెలకొంటోంది. కూర్చోటానికి కుర్చీలు సరిగా ఉండవు. ఫ్యాన్లు ఉండవు. వచ్చినప్పుడు రోగితోపాటుగా ఇవి తీసుకు రావాల్సి వస్తోందని స్థానిక ప్రజలు, ఇక్కడికి వచ్చిన రోగుల కుటుంబసభ్యులు వాపోతున్నారు. శానిటేషన్ వర్కర్స్‌తో కలిపి ఇక్కడ మొత్తం 56మంది ఆసుపత్రి సిబ్బంది ఉన్నారు. కానీ ప్రభుత్వాలు మారుతున్నా ఇక్కడ మాత్రం కనీస సదుపాయలు మాత్రం శూన్యం. ఇదిలా ఉండగా ఇక్కడ కొంత మంది వైద్యులు మాత్రం ఇక్కడ వచ్చిన రోగులను పట్టించుకోకుండా తమ సొంత క్లినిక్‌లకు వెళ్లిపోతూ ఉంటారు. అది కూడా ఇక్కడ ప్రభుత్వ ఆసుపత్రిలో డ్యూటీ చేస్తున్న టైంలోనే రోగులను గాలికి వదిలేసి వెళ్ళిపోవటం గమనార్హం. ఇది వీళ్ళకి ఏమి కొత్త కాదు. ఏం చేసిన అడిగే నాదుడే లేడు. వీళ్ళకి నచ్చిన టైంలో రావటం వెళ్ళిపోవటం. ఇక్కడ స్టాఫ్‌నర్స్‌లు చెయ్యాల్సిన పని శానిటేషన్ వర్కర్స్‌తో చేయిస్తూ ఉంటారు. బహుశా ఇలాంటి వింత దృశ్యాలు ఎక్కడ చూసి ఉండరు. శానిటేషన్ వర్కర్ తను చెయ్యాల్సిన పనిని ప్రక్కన పెట్టి ఎం.యన్.ఓ (మేల్ నర్సింగ్ ఆఫీసర్) చెయ్యాల్సిన పనిని వీళ్ళు చేస్తూ ఉండటం విడ్డూరం. ఇలాంటి వింత సంఘటనలు చూస్తుంటే ఇది ఆసుపత్రినా లేక ఇదేంటి అని అనిపించేలా అబ్బురపరిచే దృశ్యాలు మీకు కనపడతాయి. పోనీ ఈ వైద్యులు ఏంటి అడగరా అంటే అస్సలు వాళ్లకేం పట్టనట్లు ఉంటారు. మరి ఆసుపత్రి ప్రధాన వైద్యులు గురించి చేప్పక్కర్లేదు. ఇక్కడ ఈయనే ప్రధాన సూత్రదారి. ఈయన ఏమి చేస్తున్నారో అని చూస్తే ఆసుపత్రిలో పని చేస్తూ క్లినిక్ లకు వెళ్లిపోతున్న కొంత మంది డాక్టర్లు కంటే ముందుగా ఈయనే పైసల కోసం రోగులను ఇలా గాలికి వదిలేసి నాయకుల అందదండలతో ప్రారంభించిన ప్రైవేట్ క్లినిక్ లో ఓపీలు చూస్తూ కాలక్షేపం చేస్తూ ఉంటారు. దీనిపై సీతంపేట ఐటీడీఏ పిఓ, శ్రీకాకుళం జిల్లా డీఎంఅండ్‌హెచ్‌ఓ స్పందించి తగు విచారణ జరిపి చర్యలు తీసుకోవాల్సిందిగా సీపీఎం నాయకులు సిర్ల ప్రసాద్ డిమాండ్ చేశారు.



## రైతు సోదరులకు శుభవార్త

(సత్యంన్యూస్, ఆమదాలవలస)



నియోజకవర్గ పరిధిలో గల రైతుల వద్ద నుంచి అదనంగా లక్ష టన్నుల ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని ఎమ్మెల్యే కూన రవికుమార్ తెలిపారు. ఈమేరకు బుధవారం సచివాలయంలో ఆయన ఈ అంశాన్ని ప్రస్తావించారు. నియోజకవర్గ ప్రజలు దీనిని గమనించి ఆయా గ్రామాల పరిధిలో గల రైతు సేవా కేంద్రాల వద్దకు వెళ్లి ధాన్యం కొనుగోలు లావాదేవీలు నిర్వహించుకోవాలని సూచించారు. పొందూరు మండలంలో 35వేల క్వింటాళ్లు అదనంగా కొనుగోలు చేస్తామన్నారు. ఆమదాలవలస మండలంలో 25వేల క్వింటాళ్ళు, బూర్జ మండలంలో 25వేల క్వింటాలు అదనంగా కొనుగోలు చేస్తామన్నారు. సరుబుజ్జిలి మండలంలో 15వేల క్వింటాలుకు అదనపు ధాన్యం కొనుగోలుకి ప్రభుత్వం నుండి అనుమతి లభించిందన్నారు. నియోజకవర్గంలోని రైతు సోదరులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

## సోంపేటలో 13న ఉద్యోగ మేళా

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డి.ఆర్.డి.ఏ), సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ ఎంటర్‌ప్రైజ్ డెవలప్మెంట్, ఆంధ్రప్రదేశ్ (సీడాప్) సంయుక్తంగా ఈనెల 13న సోంపేటలోని ఎం.ఎం.ఎస్.లో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నాయి. ఈ మేళాలో పేటీఎం, నవత రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అనే రెండు ప్రముఖ కంపెనీలు పాల్గొని ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్, డ్రైవర్, వెహికల్ క్లీనర్ వంటి ఉద్యోగాల కోసం నియామకాలు చేపట్టనున్నాయి. ఈమేరకు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కిరణ్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి, డిగ్రీ విద్యార్హతలు కలిగిన 19 నుండి 30 సంవత్సరాల వయస్సు గల అభ్యర్థులు ఈ మేళాలో పాల్గొనవచ్చన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.11వేల నుంచి రూ.19,500 వరకు వేతనం లభిస్తుందన్నారు. ఈ ఉద్యోగమేళా ఉదయం 9.30 నుండి సాయంత్రం 4గంటల వరకు జరుగుతుందన్నారు. మేళాకు హాజరయ్యే అభ్యర్థులు రేషన్ కార్డ్/ఆధార్‌కార్డ్ జిరాక్స్, విద్యార్హత సర్టిఫికెట్ల జిరాక్స్, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు, బయోడేటాతో రావాల్సి ఉంటుందన్నారు. మొత్తం 130 ఖాళీలు ఉన్నాయని, అర్హత గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ కోరారు. మరిన్ని వివరాలకు 8106508318 (నాగేశ్వరరావు)ను సంప్రదించాలని సూచించారు.

## సేవలతో ఆత్మసంతృప్తి

- ప్రముఖ వైద్యురాలు లైన్ డాక్టర్ పైడి సింధూర -



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

సేవలతో ఆత్మసంతృప్తి కలుగుతుందని, అందులో ఉండే అంతర ఆనందానికి విలువ కట్టలేమని ప్రముఖ వైద్యురాలు లైన్ డాక్టర్ పైడి సింధూర అన్నారు. బుధవారం ఎచ్చెర్ల మండలం అల్లినగరానికి గ్రామానికి చెందిన గేదెల చిన్నారావు అనే నిస్సహాయ వికలాంగునికి చక్రాల కుర్చీతో పాటు మూడు నెలలకు సరిపడే నిత్యావసర సరుకులు స్థానిక సింధూర హాస్పిటల్ ప్రాంగణంలో అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నారావు కొంతకాలం క్రితం జరిగిన ప్రమాదంలో రెండు కాళ్లను పోగొట్టుకొని నిస్సహాయునిగా జీవనం కొనసాగిస్తున్నారని, పాలకొండకు చెందిన కొవగాన వాసు అండగా నిలిచి మూడు చక్రాల కుర్చీని అందించారని, అలాగే శ్రీకాకుళానికి చెందిన సుసరాపు శ్రీలత మూడు నెలలకు సరిపడే నిత్యావసర సరుకులను అందించారని తెలిపారు. అల్లినగరానికి చెందిన అల్లంశెట్టి సంతోష్ వీరి కుటుంబ దీనస్థితిని రెడ్‌క్రాస్ ప్రతినిధి నంది ఉమా శంకర్‌కు తెలపగా, స్పందించిన ఉమా తమ ఎమర్జెన్సీ బ్లడ్ సర్వీస్ మిత్రబృందం అందించిన సహకారంతో వీరి కుటుంబానికి అండగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో బాధిత కుటుంబ సభ్యులు, నిర్వాహకుడు అల్లంశెట్టి సంతోష్, దాతలు కొవగాన వాసు, మిత్రుడు కొవగాన శంకర్రావు, ఉర్లం శివతేజ, రెడ్‌క్రాస్ ప్రతినిధులు నంది ఉమాశంకర్, బి.జగదీశ్, పొడుగు చరణ్ పాల్గొన్నారు.

## హోటళ్లు, లాడ్జీలకు గ్రీన్‌లీఫ్ రేటింగ్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



జిల్లా ఉన్న హోటళ్లు, లాడ్జీలకు గ్రీన్‌లీఫ్ రేటింగ్ ఇస్తామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశమందిరంలో మంగళవారం హోటళ్లు, లాడ్జీల యాజమాన్యంతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "ఈ వినూత్న వ్యవస్థ హోటళ్లు, లాడ్జీలు, రెస్టారెంట్లలో పరిశుభ్రతను నిర్ధారించడం ద్వారా పర్యాటకులకు ఆహ్లాదకరమైన అనుభవాన్ని అందిస్తుందన్నారు. గ్రీన్‌లీఫ్ రేటింగ్ ద్వారా కలెక్టర్ బఫర్ గిల్ కెర్ వారికి గ్రీన్‌లీఫ్ రేటింగ్ ఇస్తామని ప్రకటించారు. "లిగ్రీన్ లీఫ్ రేటింగ్ సిస్టమ్ వివిధ విభాగాలలో అమలు చేయబడుతుందని, పర్యావరణ సమస్యలను దృష్టిలో ఉంచుకుని పర్యాటకరంగంలో సురక్షితమైన పారిశుధ్య నిర్వహణను ప్రోత్సహించడానికి ఈ రేటింగ్ వ్యవస్థ ప్రవేశపెట్టబడిందన్నారు. రేటింగ్ ప్రక్రియను పర్యవేక్షించడానికి ఒక కమిటీని ఏర్పాటు చేయబడుతుందని, కలెక్టర్ అధ్యక్షతన మున్సిపల్ కమిషనర్, గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుద్ధ్య మిషన్, జడ్పీ సీఈవో, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ సభ్యులతో కూడిన కమిటీ ఉంటుందన్నారు. జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా పర్యాటక అధికారి సభ్య కార్యదర్శులుగా వ్యవహరిస్తారన్నారు. డివిజన్ స్థాయిలో హోటళ్లు, లాడ్జీలను తనిఖీ చేయడానికి ఒక ఉప కమిటీని ఏర్పాటు చేస్తామని తెలిపారు. గ్రామ పంచాయతీలలో ఉన్న హోటళ్లు, లాడ్జీల జాబితా గ్రామ పంచాయతీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచబడుతుందన్నారు. జిల్లాస్థాయి శిక్షణను క్రమానుగతంగా నిర్వహిస్తామన్నారు. గ్రీన్ లీఫ్ రేటింగ్ సాధించడంలో సహకరించాలని కలెక్టర్ జిల్లాలోని అన్ని హోటళ్లు, లాడ్జీల యాజమాన్యాలకు ఈ సందర్భంగా సూచించారు.

ఈ సమావేశంలో గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్య మిషన్ ఎస్‌ఈ ఎహసాన్ భాషా, జిల్లా పరిషత్ సీఈవో శ్రీధర్ రాజ, జిల్లా పంచాయతీ అధికారి భారతి సౌజన్య, జిల్లా పర్యాటక అధికారి ఎన్. నారాయణరావు, ఎంఈఓలు, వాటర్ స్పోర్ట్స్ అసో సియేషన్, హోటల్ అసోసియేషన్ స్టేట్ సెక్రెటరీ మెట్ట నాగరాజు, హోటల్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ సతీష్‌లు పాల్గొన్నారు.

### జనసేన ఆవిర్భావ దినోత్సవం
## విజయవంతం చేద్దాం




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఈ నెల 14న పిఠాపురం చిత్రాడలో జరగబోయే జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవ విజయోత్సవ బహిరంగ సభను విజయవంతం చేయాలని జనసేన ప్రతినిధులు పిలుపునిచ్చారు. పి.గన్నవరం నియోజకవర్గం మావూడుకుదురు మండల ముఖ్య నాయకులతో స్థానిక ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఆధ్వర్యంలో మండల సన్నాహాక సమావేశం నిర్వహించారు. జనసేన ఆవిర్భావ దినోత్సవ వేడుకుల నేపథ్యంలో పి.గన్నవరం నియోజకవర్గం మావూడుకుదురు మండల కార్యాచరణ సమన్వయకర్తలుగా నియమితులైన నాయకులతో జనసేనపార్టీ ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు, జనసేన రాష్ట్ర కార్యదర్శి, పి.గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గ కార్యాచరణ సమన్వయకర్తలు పిసిని చంద్రమోహన్, కరాటం సాయి, పార్లమెంటరీ నియోజకవర్గ సమన్వయకర్త బండారు శ్రీనివాసరావులు మాట్లాడారు. చిత్రాడలో ఈ నెల 14న నిర్వహిస్తున్న జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ సభ విజయవంతం చేసే క్రమంలో స్థానిక మండల కమిటీలు నియమించారు. అనంతరం హాలో పి.గన్నవరం, చలో పిఠాపురం చిత్రాడ పోస్టర్‌లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా ఉపాధ్యక్షులు, ఆవిర్భావ దినోత్సవ గ్రౌండ్ మేనేజ్మెంట్ కమిటీ సభ్యులు గర్భాన సత్తిబాబు, స్థానిక జిల్లా నాయకులు, మండల నాయకులు, వీర మహిళలు పాల్గొన్నారు.

డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పని చేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను.
CONTACT:
9440001447, 8341163666

భాస్కర టూర్స్ & ట్రావెల్స్
ఆన్‌లైన్ వర్క్స్
ఈ-రిజర్వేషన్, బస్ టిక్కెట్స్, వాల్వో ఎ/సి, నాన్ ఎ/సి, రైల్వే ఫ్లైట్ టిక్కెట్స్ మొదలైనవి చేయబడును.
ఆర్ట్స్ కాలేజ్ రోడ్, అంబేద్కర్ జంక్షన్ దగ్గర, శ్రీకాకుళం.
సెల్: 77320 63656, 80967 20076
btsrikakulam@gmail.com

ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

మెట్రో సోఫా వర్క్స్
అన్ని రకముల సోఫాలు, ఫర్నిచర్ మేనుఫేక్చర్స్ (హోల్‌సేల్ & రిటైల్)
షాపు నెంబరు 1, కొన్నవీధి, వన్‌వే ట్రాఫిక్ రోడ్డు, మాధవ మోటార్స్ దరి, శ్రీకాకుళం
సెల్: 83094 81129

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
Near Surya Mahal Theatre
Women's College Road,
Srikakulam - 532 001




Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.